సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 14 । మే । 2025



రూ.2.20 లక్షల విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవనం నిర్మాణానికి దాడిశెట్టి విష్ణుచక్రం దంపతులు (తుని) రూ 2.20 లక్షల విరాళం సమర్పించారు.




ఇదేం ఆటంకం?

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో కొన్ని క్రీడలకు సంబంధించి, కొంత మంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

8లో

కడలిలోకి 1,869 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 1,869 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.45 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

జైలు నుంచి విడుదలైన నేరస్తులపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వివిధ నేరాలపై జైలుకు వచ్చి, శిక్ష అనంతరం విడుదలైన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ సూచించారు. ఆస్తి నేరాలపై ఆయన మంగళవారం జిల్లా పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రైమ్ ప్రోన్, ఐసోలేటెడ్ ఏరియాలలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి, రాత్రి సమయాలలో ప్రత్యేక గస్తీ నిర్వహించాలన్నారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైసెస్, ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా చెక్ చేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ ప్రాపర్టీ నేరాలపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రాత్రి వేళల్లో ఆస్తి నేరాలను అరికట్టేందుకు స్పెషల్ పార్టీలు, క్రైమ్ టీమ్‌లు అప్రమత్తంగా తిరగాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ మరింత పటిష్టం చేయాలన్నారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ: ఈ నెల 19 నుంచి 28 వరకూ జరిగే పదో తరగతి, ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) టి.సీతారామ్మూర్తి తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణపై తన చాంబర్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 28 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వీటికి రెగ్యులర్ 3,167, ప్రైవేటు 686 మంది కలిపి మొత్తం 3,853 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు 589 మందికి 6, ఇంటర్ విద్యార్థులు 771 మందికి 4 చొప్పున పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలూ సంబంధిత శాఖల అధికారులు చేపట్టాలని కోరారు. సమావేశంలో డీఈఓ కె.వాసుదేవరావు, విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకుమారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా సిస్టం సీఈగా శ్రీరామకృష్ణ

ధవళేశ్వరం: గోదావరి డెల్టా సిస్టం సీఈగా ఆర్.శ్రీరామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ఎస్‌ఈగా ఉన్న ఆయన ఇప్పటికే గోదావరి డెల్టా సిస్టం సీఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతిపై ఇప్పుడు పూర్తి స్థాయి సీఈగా నియమితులయ్యారు.

రైతుల పాలిట పగాకు

- కొనుగోళ్లు ప్రారంభమై 51 రోజులు
- ఖరారు కాని ఎగుమతి ఆర్డర్లు
- వేలం కేంద్రాలకు రాని ప్రధాన కంపెనీలు
- పెరగని పొగాకు ధర
- పెట్టుబడి కూడా దక్కదేమోనని రైతుల ఆందోళన



దేవరపల్లి వేలం కేంద్రంలో అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: పొగాకు సాగు రైతుల పాలిట పగాకుగా మారింది. ధర దారుణంగా పడిపోయింది. గత ఏడాది కిలో పొగాకు ధర గరిష్టంగా రూ.410 పలకడంతో రైతులకు ఊహించని లాభాలు వచ్చాయి. దీంతో, ఈ ఏడాది భూముల కౌలు, బ్యారన్ల అద్దెలకు రెక్కలొచ్చాయి. అయినప్పటికీ నిబంధనలు పక్కన పెట్టి మరీ రైతులు అధిక విస్తీర్ణంలో పంట సాగు చేశారు. ప్రస్తుత పంట కాలంలో పొగాకు కొనుగోళ్లు మార్చి 24న ప్రారంభించారు. ప్రారంభ ధర కిలోకు గరిష్టంగా రూ.290 పలికింది. కొనుగోళ్లు ప్రారంభించి మంగళవారానికి 51 రోజులైంది. మొత్తం 38 రోజుల పాటు వేలం జరిగింది.

నిరాశలో రైతులు

రోజులు గడుస్తున్నా ధరలో పెరుగుదల, కొనుగోళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. నాణ్యమైన పొగాకుకు కూడా కిలోకు గరిష్టంగా రూ.260 నుంచి రూ.290 వరకూ మాత్రమే ప్రస్తుతం లభిస్తోంది. ధరలు పెరగకపోవడంతో రైతులు వేలం కేంద్రాలకు బేళ్లు తక్కువగా తెస్తున్నారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు కంపెనీలు నిరాకరిస్తున్నాయి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రతికూల వాతావరణం, సాగుకు అధిక పెట్టుబడులు, వీటన్నింటికీ మించి కూలీల సమస్య.. వెరసి పొగాకు రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నా సరైన ధర రాక నష్టాలు చవి చూడాల్సి వస్తోందని అంటున్నారు. కనీసం కౌలు డబ్బులు, పెట్టుబడి వస్తే చాలని దీనంగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు పొగాకు ప్రధాన ఎగుమతి సంస్థలైన ఐటీసీ, జీపీఐ, పీఎస్ఎస్, డక్కన్, అలయన్స్ వంటి కంపెనీలకు ఇంత వరకూ ఎగుమతి ఆర్డర్లు ఖరారు కాలేదు. దీంతో ఆయా కంపెనీలు ఇంకా వేలం కేంద్రాలకు రాకపోవడంతో కొనుగోళ్లు కూడా మందకొడిగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఐటీసీ ఎక్కువ శాతం పొగాకు కొనుగోలు చేస్తోంది. ఈ నెల 20 తర్వాత ఆర్డర్లు ఖరారవుతాయని, అనంతరం ప్రధాన కంపెనీలు వేలం కేంద్రాలకు వస్తాయని తెలుస్తోంది.

పెరిగిన సాగు ఖర్చులు

గత ఏడాదితో పోల్చుకుంటే పొగాకు సాగు ఖర్చులు 20 నుంచి 25 శాతం వరకూ పెరిగాయి. ఎకరం భూమికి కౌలు రూ.70 వేలు, బ్యారన్ అద్దె రూ.1.60 లక్షలకు తీసుకుని మరీ పంట వేశారు. అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టారు. తీరా మార్కెట్ పరిస్థితి చూస్తే కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. పొగాకు సాగు చేస్తున్న రైతుల్లో 80 శాతం కౌలుదారులే ఉన్నారు.

రూ.253.64 కోట్ల పొగాకు విక్రయం

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1, 2 వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఇప్పటి వరకూ రూ.253.64 కోట్ల విలువైన 9.19 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. రైతులు 71,096 బేళ్లు విక్రయించారు. వేలంలో 10 కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇప్పటి వరకూ కిలో గరిష్ట ధర రూ.290, కనిష్ట ధర రూ.220, సగటు ధర రూ.276.18 చొప్పున లభించాయి.

ఉత్పత్తి అంచనా 80 మిలియన్ల కిలోలు

ప్రస్తుత పంట కాలంలో ఐదు వేలం కేంద్రాల పరిధిలో 59 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే, క్యూరింగ్‌ల ప్రారంభంలో 70 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రస్తుతం క్యూరింగ్‌లు ముగింపు దశకు చేరడంతో 80 మిలియన్ల కిలోల వరకూ ఉత్పత్తి వస్తుందని అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. మొత్తం 14,754 మంది రైతులు 12,723 బ్యారన్లు రిజిస్ట్రేషన్ చేయించుకోగా సుమారు 29,450 హెక్టార్లలో పొగాకు సాగు చేసినట్టు అధికారికంగా లెక్కలు వేశారు. అయితే రిజిస్ట్రేషన్లు లేకుండా మరో 10 వేల హెక్టార్లలో రైతులు సాగు చేసినట్లు అంచనా. ఈ ఏడాది బ్రెజిల్, జింబాబ్వే దేశాల్లో పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశమున్నందున పరిమితికి మించి పొగాకు సాగు వద్దని, ఉత్పత్తి పెరిగితే నష్టపోతారని ముందు నుంచీ అధికారులు రైతులకు చెబుతూనే వచ్చారు. వేలం కేంద్రాల వారీగా సమావేశాలు పెట్టి పంట నియంత్రణపై సూచనలు చేశారు. కానీ, రైతులు ఈ సూచనలను బేఖాతరు చేసి, సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచారు. బాడవ భూముల్లో సైతం సాగు చేశారు. ఈ పొగాకు కొనుగోలుకు కంపెనీలు నిరాకరిస్తూండటంతో లబోదిబోమంటున్నారు.

కోలుకోవడం కష్టం



కూటమి పాలనలో రైతులకు అన్నీ కష్టాలే. పంటకు గిట్టుబాటు ధర లేదు. పెట్టుబడులు రాని పరిస్థితి. పొగాకు ధరలు మరీ దారుణంగా ఉన్నాయి. పెట్టుబడులు పెరిగాయి. కూలీల సమస్య ఎక్కువగా ఉంది. ఎకరాకు రూ.2.50 లక్షల పెట్టుబడి, కౌలు అవుతోంది. ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు రూ.2.30 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. అంటే ఎకరాకు సుమారు రూ.20 నుంచి రూ.40 వేల వరకూ నష్టం వస్తోంది. నేను 50 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నా. గిట్టుబాటు ధర రాకపోతే రైతులు, కౌలు రైతులు కోలుకోవడం చాలా కష్టం. పొగాకు మార్కెట్ సంక్షోభంలో ఉన్నప్పుడు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి, రైతులను ఆదుకొంది. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు.

– వల్లభనేని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం, వెదుళ్లకుంట, గోపాలపురం మండలం

రైతుల పరిస్థితి దయనీయం



గిట్టుబాటు ధర రాక పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కంపెనీలు పూర్తి స్థాయిలో వేలంలో పాల్గొనకపోవడంతో మార్కెట్లో కొనుగోలుదారుల మధ్య పోటీ లేదు. ముందు ముందు మంచి ధర వస్తుందనే ఆశతో ఉన్నాం. సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరగడం వల్ల మార్కెట్ సంక్షోభంలో ఉంది. ఇందులో రైతుల తప్పిదం కూడా ఉంది.

– పిన్నమనేని మధుమోహన్, పొగాకు రైతు సంఘం ప్రతినిధి, చిన్నాయగూడెం, దేవరపల్లి మండలం

గిట్టుబాటు ధర ఇప్పించాలి



మార్కెట్ పరిస్థితి అర్థం కావడం లేదు. సాగు ఖర్చులు కూడా వస్తాయో లేదో తెలియని పరిస్థితి. కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. గిట్టుబాటు ధర లేక వేలానికి బేళ్లు తీసుకురావడం లేదు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదు. ఐదో రెలుపు నుంచి పొగాకు కొనుగోలు చేస్తున్నారు. పీఎస్ఎస్, డక్కన్, జీపీఐ కంపెనీలు మార్కెట్‌కు వస్తే ధర పెరుగుతుందనే ఆశతో రైతులున్నారు. ఇప్పటికైనా ట్రేడర్లతో అధికారులు చర్చించి, గిట్టుబాటు ధర ఇప్పించి, రైతులను ఆదుకోవాలి.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు రైతు సంఘం, సంగాయగూడెం, దేవరపల్లి మండలం

ఆగని టీడీపీ నాయకుల దుశ్చర్యలు



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు

గోకవరం: జగ్గంపేట, గోకవరం మండలాల సరిహద్దున ఉన్న సింగారమ్మ చింత ఆలయ అర్చకురాలు వట్టికూటి సీతామహాలక్ష్మి ఇంటిని మల్లిసా లకు చెందిన టీడీపీ నాయకులు గత నెలలో కూల గొట్టారు. అక్కడితో ఆగని వారు.. ఆ ఇంటి అవశేషాలకు సైతం నిప్పు పెట్టి బూడిద చేశారు. తాము మంగళవారం ఆలయం వద్దకు వచ్చేసరికి ఇంటికి సంబంధించిన కర్రలతో పాటు సామగ్రి మొత్తం బూడిదైందని బాధితులు వాపోయారు. తమను శాశ్వతంగా వెళ్లగొట్టేందుకే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ బాధితులతో కలిసి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు గోకవరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ సాయిప్రసాద్, ఎస్సై పవన్‌కుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్‌రావు మాట్లాడుతూ, సింగారమ్మ చింత అమ్మవారి ఆలయం వద్ద వంశపారంపర్యంగా అర్చకత్వాన్ని కొనసాగిస్తూ, అక్కడే చిన్నపాటి దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్న సీతామహాలక్ష్మిపై మల్లిసాలకు చెందిన టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాత్రికి రాత్రే దుకాణాన్ని దౌర్జన్యంగా ధ్వంసం చేయడంతో పాటు సింగారమ్మ అమ్మవారి నగలు, ఇతర విలువైన వస్తువులు పట్టుకుపోయారన్నారు. కూల్చివేసిన పాకతో పాటు ఇతర సామగ్రికి నిప్పంటించారని అన్నారు. బాధితులకు న్యాయం చేయకుంటే ఈ నెల 22 నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

కనుల విందుగా.. విరుల పండుగ..

- ఘనంగా సత్యదేవుని శ్రీపుష్పయాగం
- భారీగా తరలి వచ్చిన భక్తులు



స్వామి, అమ్మవార్లకు ఊయలలో పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం: వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం రాత్రి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి శ్రీపుష్పయాగ మహోత్సవం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఒకవైపు నిండుగా అలంకరించిన సుగంధభరిత పుష్పమాలికలు.. మరోవైపు రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో మెరిసిపోతున్న కల్యాణ మండపంలో.. నూతన పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పమాలలు ధరించి వేదికపై కల్యాణ శోభతో ప్రకాశిస్తున్న స్వామి, అమ్మవార్ల శ్రీపుష్పయాగ మహోత్సవాన్ని వేలాది మంది భక్తులు దర్శించి, తన్మయత్వం చెందారు. పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా, నవదంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను కల్యాణ మండపానికి ఊరేగింపుగా రాత్రి ఏడు గంటలకు తీసుకు వచ్చారు. వెండి సింహాసనంపై స్వామి అమ్మవార్లను, పక్కనే మరో ఆసనంపై సీతారాముల మూర్తులను ఉంచి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం గావించి, గర్భాదాన కార్యక్రమానికి సంబంధించిన పూజలు నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి, వేదాశీస్సులు అందజేసిన అనంతరం సర్వాంగసుందరంగా అలంకరించిన ఊయల మీద విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అలంకరణలో సత్యదేవుడు, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో పూజించారు. తొమ్మిది రకాల పిండి వంటలు నివేదించారు. పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊయలను మూడు పర్యాయాలు ఊపారు. ఊయల ఎదురుగా ఉంచిన అద్దంలో స్వామి, అమ్మవార్ల ప్రతిబింబాలను తిలకించి భక్తులు పులకించారు. తరువాత దంపత తాంబూలాలు, ప్రసాదాలు అందించారు. వైదిక కార్యక్రమాలను వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, దత్తాత్రేయశర్మ, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వైదిక కమిటీ సభ్యుడు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్ తదితరులు నిర్వహించారు. కార్యక్రమానికి వేలాదిగా వచ్చిన మహిళలకు జాకెట్టు ముక్కలు పంపిణీ చేశారు. శ్రీపుష్పయాగంతో సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.



కార్యక్రమానికి వచ్చిన మహిళలు, భక్తులు



కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్, ఈఓ దంపతులు



స్వామి, అమ్మవార్లకు నివేదించిన పిండివంటలు, ఫలాలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఫలిస్తున్న పంచ్‌తంత్రం!



రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన మహిళా బాక్సర్లు

- రింగ్‌లోకి దిగితే పతకం రావాల్సిందే
- సత్తా చాటుతున్న పిఠాపురం మహిళా బాక్సర్లు



శిక్షణ పొందుతున్న మహిళా బాక్సర్లు



శిక్షణ పొందుతున్న మహిళా బాక్సర్లు

పిఠాపురం: నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలనే ఆలోచన వారిని క్రీడల వైపు అడుగులు వేసేలా చేసింది. ఈ ఆటకు ఆడవారెందుకు అనే క్రీడలోనే పట్టుదల వారిని బాక్సింగ్ వైపు నడిపించింది. రింగ్‌లోకి దిగితే పతకం ఖాయం అనే రీతిలో తమ ప్రతిభా పాటవాలను చూపిస్తున్నారు పిఠాపురానికి చెందిన మహిళా బాక్సర్లు. ఒలింపిక్ పతకాన్ని అందించడమే తమ లక్ష్యం అంటున్నారు వీరు. ఇటీవల భారత్ బాక్సింగ్‌లో దూసుకెళ్తోంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లతో పాటు ఆసియా, కామన్వెల్త్, అంతర్జాతీయ ఈవెంట్‌లలో భారత ఆటగాళ్లు రాణిస్తున్నారు. బాక్సింగ్‌లో టాప్ 5 దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా భారత మహిళలు ఆడిన 12 చాంపియన్ షిప్‌లలో 10 గోల్డ్ మెడళ్లతో సహా 39 పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ మెడల్స్ సాధించిన వారి జాబితాలో తదుపరి తమ పేరు నమోదు చేసుకుంటామంటున్నారు ఇక్కడి మహిళా బాక్సింగ్ క్రీడాకారులు.

మహిళా బాక్సర్లు సత్తా చాటుతున్నారు



నేను 8 సంవత్సరాల నుంచి పిఠాపురంలో బాక్సింగ్ శిక్షణ ఇస్తున్నాను. నా దగ్గర 150 మంది 10 నుంచి 30 సంవత్సరాల వయసు ఉన్న పురుషులు, మహిళలు ఉన్నారు. వారిలో మహిళా బాక్సర్లు 70 మంది వరకు ఉన్నారు. ఇప్పటివరకు 30 మంది మహిళా బాక్సర్లు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నారు. 40 మంది జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. నలుగురు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. బాక్సింగ్ యుద్ధ కళ. బాక్సింగ్‌లో సబ్ జూనియర్, జూనియర్, యూత్, సీనియర్స్ మెన్ అండ్ వుమెన్ విభాగాలు ఉంటాయి. వయసును బట్టి బరువును బట్టి పోటీ ఉంటుంది. బాక్సింగ్ నేర్చుకుని పతకాలు సాధిస్తే విద్య, ఉద్యోగాల్లో 3 శాతం స్పోర్ట్స్ కోటా ఎంతగానో ఉపయోగపడుతుంది. బాలికలు ఎక్కువగా ఈ క్రీడ పట్ల మక్కువ చూపుతున్నారు.

– పి.లక్ష్మణరావు, బాక్సింగ్ కోచ్, పిఠాపురం

ఒలింపిక్ మెడల్ సాధించడమే ధ్యేయం



నేను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నా తండ్రి బ్యాంక్ ఉద్యోగి. నాకు చిన్నప్పటి నుంచి బాక్సింగ్ అంటే ఇష్టం. నా సరదాను చూసి నా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. నేను మా కోచ్ లక్ష్మణరావు దగ్గర చేరి బాక్సింగ్ నేర్చుకున్నాను. ఏడాదిన్నర కాలంలోనే అన్ని మెళుకువలు నేర్చుకుని కాకినాడ డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ బాక్సింగ్‌కు జిల్లా స్థాయిలో ఎంపికయ్యాను. పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలలో స్వర్ణ పతకం సాధించాను. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 బాక్సింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించాను. విశాఖపట్నంలో జరిగిన యూత్ వుమెన్ బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించాను. ఒలింపిక్ మెడల్ సాధించడమే నా ధ్యేయం.

– జే ఐశ్వర్య సూరి దీపిక, బాక్సింగ్ క్రీడాకారిణి, పిఠాపురం

పట్టుదలతో నేర్చుకున్నా



క్రీడల్లో మంచి ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే ఆలోచన ఉండేది. ఏ ఆటలో నాకు మంచి జరుగుతుందనేది అర్థమయ్యేది కాదు. కాని పిఠాపురంలో బాక్సింగ్ క్రీడలో శిక్షణ ఇస్తున్న కోచ్ లక్ష్మణరావు వద్దకు వెళ్లి మాట్లాడగా నీవు బాక్సింగ్ బాగా ఆడగలుగుతావు అంటు ప్రోత్సాహించారు. ముందు కొంత భయమేసింది ఇంట్లో వాళ్లు బాక్సింగ్ అంటే చాలా ధైర్యం ఉండాలి.. జాగ్రత్త అన్నారు. కాని మా కోచ్ చాలా ధైర్యం చెప్పారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో బాక్సింగ్ నేర్చుకున్నా. పిఠాపురంలో జరిగిన యూత్ వుమెన్ బాక్సింగ్ జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించాను. విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి యూత్ వుమెన్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించాను. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాను. జాతీయ స్థాయిలో మంచి పతకాలు సాధించడమే ధ్యేయం.

– అడబాల వైష్ణవి, బాక్సింగ్ క్రీడాకారిణి, మల్లాం, పిఠాపురం మండలం

స్పోర్ట్స్ కోటాలో ఉన్నత స్థానం సాధిస్తా



ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పూర్తి చేశాను. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నాను. నాకు స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం మా తల్లిదండ్రులు నా ఇష్టాన్ని గమనించి కోచ్ లక్ష్మణరావు దగ్గర జాయిన్ చేశారు. ఆయన నాకు ముందుగా ధైర్యం చెప్పి బాక్సింగ్‌లో మెళుకువలు నేర్పించారు. ఇప్పుడు నేను రాష్ట్ర బాక్సర్‌గా పేరు పొందాను. స్పోర్ట్స్ కోటాలో డాక్టర్ అయి పేదలకు ఉచిత వైద్యం చేయడమే నా లక్ష్యం.

– కాకాద హరిణి, బాక్సింగ్ క్రీడాకారిణి, పిఠాపురం

క్లుప్తంగా

గడువు ముగిసిన బీరు బాటిళ్లు ధ్వంసం



గడువు ముగిసిన బీరు బాటిళ్లను ధ్వంసం చేస్తున్న అధికారులు

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం పరిధిలోగల బీరు ఫ్యాక్టరీలో కాలం చెల్లిపోయి నిల్వ ఉన్న సుమారు ఆరువేల కేసుల బీర్‌ను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇలోయస్ బ్రావరిజస్‌కు చెందిన ఫ్యాక్టరీలో బీరు తయారు అవుతుంది. కొంతకాలంగా బీరు తయారీ నిలిచిపోయింది. దీంతో గోడౌన్ ఖాళీ చేయడంలో భాగంగా ఎక్సైజ్ అధికారుల సమక్షంలో కాలం చెల్లిన బీరు సీసాల స్టాక్‌ను ధ్వంసం చేస్తున్నారు. సుమారు ఆరువేల కేసులను ధ్వంసం చేయాల్సి ఉండగా సోమవారం సుమారు 1,000 కేసుల బీర్ సీసాలను ధ్వంసం చేశారు. బుధవారం కూడా ఈ ప్రక్రియ జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఇదేం ఆటంకం?



స్విమ్మింగ్ పూల్‌లో డీఎస్‌ఏ అధికారులు అతికించిన రుసుము వివరాలు

- డీఎస్‌ఏలో శిక్షణ పేరుతో దోపిడీ
- కొన్ని క్రీడల్లో అనధికార వసూళ్లు
- వెలవెలబోతున్న శిబిరాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రైవేట్ శిక్షణకు అనుమతులు



డీఎస్‌ఏలో స్విమ్మింగ్ శిక్షణ



డీఎస్‌ఏ ముఖ ద్వారం



డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వేసవి సెలవులను ఊరికే గడిపేయకుండా విద్యార్థులు తమకు నచ్చిన ఆటల్లో మెళుకువలు నేర్చుకుని ఉత్తమ క్రీడాకారులుగా తయారు కావడం కోసం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ... రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సహకారంతో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ శిబిరాలు మే ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 50 శిబిరాలు నిర్వహిస్తుండగా, కాకినాడ క్రీడామైదానం బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, క్రికెట్, జుడో, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, టెన్నిస్‌లో వేసవి శిక్షణ అందిస్తున్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో కోచ్‌లు లేని కారణంగా శిక్షణ ఇవ్వడం లేదు. సెలవుల్లో శిక్షణకు హాజరవుతున్న క్రీడాకారుల నుంచి కొన్ని క్రీడల్లో కోచ్‌లు అనధికారంగా డబ్బు వసూలు చేస్తూ డీఎస్‌ఏ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరి కొందరు వ్యక్తులకు డీఎస్‌ఏ అధికారులే స్వయంగా ప్రైవేటుగా శిక్షణ నిర్వహించుకునేందుకు అనుమతులు ఇస్తూ పరోక్షంగా వారిని ప్రోత్సహిస్తున్నారనే వాదన క్రీడాసంఘాల్లో వినిపిస్తోంది. వేసవి వచ్చిందంటే స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. డీఎస్‌ఏ ఆదాయ వనరుల్లో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ కీలకం. అయితే డీఎస్‌ఏ అధికారులు స్విమ్మింగ్ పూల్‌ను గతంలో ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. వారు నిర్వహించలేక డీఎస్‌ఏకు అప్పజెప్పారు. ప్రస్తుతం సిమ్మింగ్ పూల్ నిర్వహణ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డీఎస్‌ఏ నిబంధనల ప్రకారం 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు రూ.1000, 15 సంవత్సరాలు దాటిన వారికి రూ.1,500 వసూలు చేయాలి. కానీ 14 సంవత్సరాల లోపు వారి నుంచి రూ.2,000, 15 సంవత్సరాల పై బడిన వారి నుంచి రూ.2,500 వసూలు చేస్తున్నారు. వేసవి క్రికెట్ శిక్షణకు రూ.3,000 వసూలు చేస్తున్నారు. టేబుల్ టెన్నిస్ కోచ్ లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో శిక్షణను నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో కోచ్ లేకపోవడంతో కొందరు ప్రైవేట్ వ్యక్తులు శిక్షణ అందిస్తూ డీఎస్‌ఏకు రూపాయి కట్టకుండా సొమ్ము చేసుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమై 13 రోజులు కావస్తున్నా ఏ క్రీడలో ఎంత మందికి శిక్షణ అందిస్తున్నారనే వివరాలు డీఎస్‌ఏలో లేక పోవడం గమనార్హం. ఏది ఏమైనా ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాల్లో ఆశించిన స్థాయిలో క్రీడాకారులు కానరావడం లేదు. ముఖ్యంగా బాలికలు చూపిన ఆసక్తి బాలురు చూపడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొందరు ఇదే అదనుగా అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని డీఎస్‌ఏను గాడిలో పెట్టాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై మంగళవారం డీఎస్‌ఏ ముఖ్యక్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్‌ను వివరణ కోరగా డీఎస్‌ఏ నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ వసూలు చేయడానికి వీలు లేదన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకుని, క్రీడాకారులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

ఇసుక లారీ ఢీకొని కౌలు రైతు మృతి



మృతుడు రమణ (ఫైల్)

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరు గ్రామానికి చెందిన సూరెడ్డి రమణ (48)ను ఇసుక లారీ ఢీకొనడంతో మృతి చెందినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. మంగళవారం కౌలు రైతు అయిన సూరెడ్డి రమణ తుని రైతుబజారులో కూరగాయలు విక్రయించుకుని మోపెడ్‌పై స్వగ్రామానికి వస్తుండగా వెలంపేట వై.జంక్షన్‌లో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఇసుక లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రమణను తుని ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



యువకుడి మృతదేహం

తుని: రైలు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై జీ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..తుని–హంసవరం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 20 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు మృతి చెందాడు. మృతుడు నలుపురంగు ట్రాక్ ధరించి ఉన్నాడు. చేతిపై శ్రావణి అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి దగ్గర ఇతర ఏ ఆధారాలూ లభించలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఏలూరులో కలవచర్ల మహిళ...

రాజానగరం: భర్తతో కోపంతో పుట్టింటికి వెళ్లిన మహిళ ఊహించని ప్రమాదానికి గురై అందరికీ దూరమైంది. తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్న మండలంలోని కలవచర్లకు చెందిన బొమ్మోతు కుమారి (40) ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోవడంతో మృతిచెందింది. ఏలూరు రైల్వే స్టేషను సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలంలోని ముక్కినాడకు చెందిన కుమారికి కలవచర్లకు చెందిన ఏసుతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కాగా, కుమార్తెకు వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబ పరంగా భార్యాభర్తల నడుమ ఏర్పడిన గొడవలతో కుమారి కోపంతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఆమె తల్లిదండ్రులు మండెల సత్యనారాయణ, పాపలు పనుల కోసం హైదరాబాద్‌కి పయనమవడంతో వారితోపాటు తాను కూడా గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరింది. డోరులో నిలబడివున్న ఆమె ఏలూరు సమీపంలోకి వచ్చే సరికి ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమెను రైల్వే పోలీసులు ఏలూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె భర్త ఏసు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి, మృతురాలిని తన భార్యగా నిర్ధారించాడు. కేసును ఏలూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చంటమ్మ (ఫైల్)

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శతాధిక వృద్ధురాలు అల్లిమిల్లి చంటమ్మ(109) మంగళవారం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు ధర్మరాజు, అర్జునుడు, భీముడు, నకులుడుతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరితో పాటు 90 మంది మనుమలు, మునిమనుమలు ఉన్నారు. ఉదయం వరకు ఆరోగ్యంగా ఉన్న ఆమె టిఫిన్ చేసిన అనంతరం మరణించారు.

పెనకనమెట్ట సావరంలో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న సీఐ విజయబాబు

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలంలోని పెనకనమెట్ట సావరంలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొవ్వూరు రూరల్ సీఐ బి.విజయబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు, వారి కుటుంబ సభ్యుల తో పాటు ఈ నెల 11వ తేదీన పందలపర్రులో బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లారు. 12వ తేదీ ఉదయం తిరిగి వచ్చి చూసుకుని సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దుండగులు ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి సుమారు 8 కాసుల బంగారు వస్తువులను, రూ.8 లక్షల నగదు, 250 గ్రాముల బరువు గల వెండి వస్తువులను దొంగిలించినట్టుగా తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి డీఎస్పీ కేవీ సత్యనారాయణ, క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ స్వరూప్, సీఐ శ్రీధర్ తదితరులు పరిశీలించి, వివరాలు సేకరించారు.

పక్కింటికి భోజనానికి వెళ్లి వచ్చేలోగా దోచేశారు

రాజానగరం: ఇంటి తలుపులకు గడియపెట్టి, పక్కింటికి వెళ్లి భోజనం చేసి వచ్చేలోగానే ఇంట్లో దాచుకున్న బంగారు నగలను దుండగులు అపహరించుకుపోయారు. మండలంలోని వెలుగుబందలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. జాలెం గోపీరత్నం పక్కింటి వారి ఆహ్వానంపై భోజనం చేసి వచ్చేందుకు ఇంటి తలుపులకు గడియపెట్టి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఆ తలుపులు తెరచివుండటంతో కంగారుగా లోనికి వెళ్లి చూస్తే ఇంట్లో దాచుకున్న నాలుగు కాసుల బంగారు నగలు కనిపించలేదు. వెంటనే రాజానగరం వచ్చి, జరిగిన చోరీ గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

ఘరానా దొంగ అరెస్టు

బనశంకరి: బెంగళూరులో చోరీలకు పాల్పడుతున్న ఏపీలోని తూర్పు గోదావరికి చెందిన ఘరానా దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల నగరంలో కొడిగేహళ్లిలో ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకెళ్లారు. పోలీసులు గాలించి జేబీ నగరలో నివసించే గోదావరి వాసి కామేపల్లి శ్రీనివాస్ అలియాస్ కార్తీక్ (39)ను అరెస్ట్‌చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.9.20 లక్షల విలువచేసే 148 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గత నెల 16వ తేదీన చోరీ చేసిన తరువాత ఓ ప్రైవేటు హాస్టల్‌లో మకాం వేశాడు. పోలీసులు సీసీ కెమెరాల చిత్రాలు, ఇతర ఆధారాల ప్రకారం పట్టుకున్నారు. కార్తీక్‌కు దొంగతనాలే వృత్తి అని, బీదర్, హైదరాబాద్, సైబరాబాద్‌తో పాటు 10 పోలీస్ స్టేషన్లలో పాత నేరస్తుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. కార్తీక్, మోహన్‌రుద్ర అనే పేర్లతో తిరుగుతూ చోరీలకు పాల్పడేవాడు. ఇతడిపై ల్యాప్‌టాప్, ఇళ్లలో చోరీలతో పాటు 88 కి పైగా కేసులు ఉన్నట్లు చెప్పారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో శ్రీ షిర్డీ సాయి విజయకేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన 10, 12వ తరగతి విద్యార్థులను అభినందిస్తున్న శ్రీషిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సీబీఎస్‌ఈ 10, 12 వ తరగతి ఫలితాల్లో శ్రీ షిర్డీ సాయి విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. 12 తరగతి ఫలితాలలో ఎస్.స్నేహితశ్రీ 500 మార్కులకు 484 సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కె.పావన్‌తనయ 477 మార్కులతో ద్వితీయ స్థానం, ఎస్.విద్యాజ్యోతి శ్రీ 476 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. మొత్తం 16 మంది విద్యార్థులు 95 శాతం పైగా మార్కులు సాధించగా, 54 మంది 90 శాతం, 216 మంది 75 శాతం పైగా మార్కులు సాధించారన్నారు. హాజరైన మొత్తం విద్యార్థుల్లో 339 మంది 60 శాతం పైగా మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 10వ తరగతి ఫలితాలలో పి.హర్షిత్ సాయి 500 మార్కులకుగాను 483 సాధించి ప్రథమస్థానాన్ని సాధించాడన్నారు. పి.రేవంత్ సత్య అనిరుధ్ 481 లతో ద్వితీయస్థానం, ప్రీతీష్ పాత్రై 480తో తృతీయ స్థానాన్ని కై వసం చేసుకున్నారన్నారు. 20 మంది విద్యార్థులు 95 శాతం సాధించగా 72 మంది 90 శాతం, 180 మంది 75 శాతం పైగా మార్కులు సాధించారన్నారు. హాజరైన మొత్తం 206 మంది విద్యార్థులు 60 శాతం పైగా మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. తమ విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించడం పట్ల విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలైన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.

మైనింగ్ స్క్వాడ్‌పై దాడి

అంబాజీపేట: సినీ ఫక్కీలో మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగిపై దాడి చేసి కంపెనీకి చెందిన కారును ఐదుగురు అపహరించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సుధాకర్ ఇంఫ్రాటెక్ కంపెనీకి జిల్లా స్పెషల్ మైనింగ్ స్క్వాడ్ ఉద్యోగిగా ఊడిమూడి అనిల్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన అనిల్‌కుమార్‌తో పాటు తన తోటి ఉద్యోగులు చింతపల్లి ప్రవీణ్‌కుమార్, గూడూరి రూప్‌కాంత్‌లతో కలిసి మట్టి, ఇసుక వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో అంబాజీపేట హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నంబర్ లేని ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా ఆ వాహనాన్ని ఆపి బిల్లు చూపించమని అనిల్‌కుమార్ అడిగారు. దాంతో ట్రాక్టర్ డ్రైవర్ అతని ఓనర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో పి.గన్నవరానికి చెందిన మట్టపర్తి పండుతో పాటు మరో నలుగురు అక్కడకు వచ్చారు. అనిల్‌కుమార్‌తో పాటు వారి ఉద్యోగులతో ఘర్షణకు దిగారు. అనిల్‌కుమార్‌ను కొబ్బరి కమ్మలు, రాళ్లతో పండు, అతని వర్గీయులు దాడి చేసి గాయపరిచారు. అనంతరం ఇంఫ్రాటెక్ కంపెనీకి చెందిన వాహనాన్ని పండు, అతని వర్గీయులు తీసుకుపోయి ఆ వాహనంలో ఉన్న కంపెనీ బిల్లు పుస్తకాలు, రూ.1.30 లక్షల నగదును అపహరించారు. బాధితుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.